న్యూస్‌రీల్

కబ్జాకు గురైన చెరువును కాపాడాలని వినతి


పీవోకు వినతిపత్రం ఇస్తున్న కొత్తపేట గ్రామస్తులు

జన్నారం: మండలంలోని కొత్తపేట గ్రామ పంచాయతీ నర్సింహుల చెరువును కొత్తపేటకు చెందిన కొందరు కబ్జా చేసి పొలాలు చేసుకుంటున్నారని, కబ్జా కోరల నుంచి చెరువును కాపాడాలని కోరుతూ గురువారం వంచిత్ బహుజన అగాడి పార్టీ జిల్లా అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ ఆధ్వర్యంలో కొత్తపేట గ్రామానికి చెందిన పలువురు ఉట్నూర్‌లో ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కొత్తపేటకు చెందిన దినేష్‌నాయక్, బుద్దే శ్రీనివాస్, సీడం భీంరావు, కొడప ఆనందరావు, వసంత్, తిరుపతి తదితరులున్నారు.

సాయికుంట చెరువును కాపాడాలి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని సాయికుంట చెరువు కబ్జాకు గురవుతుందని, దానిని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ మేనేజర్ కె.విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు సల్మాన్ షేక్, బచ్చలి ప్రవీణ్ కుమార్, పురెళ్ల నితీష్ పాల్గొన్నారు.

'మనఊరు-మనబడి' పనుల పరిశీలన

జైపూర్: మండల వ్యాప్తంగా 'మనఊరు-మనబడి' కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు, ఎంపీడీవో సత్యనారాయణతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందారం దొరగారిపల్లి, పౌనూర్ ప్రాథమిక పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేసి చేపడుతున్న ప్రహరీ, వంట గది, మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో అనిల్‌కుమార్, ఏపీవో బాలయ్య, స్థానిక ఎస్ఎంసీ చైర్మన్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వేణుగోపాలచారిని కలిసిన టీబీజీకేఎస్ నేతలు


పుష్పగుచ్ఛం ఇస్తున్న టీబీజీకేఎస్ నేతలు

శ్రీరాంపూర్: రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా నియమించబడ్డ సముద్రాల వేణుగోపాలచారిని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. టీబీజీకేఎస్ కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్ రెడ్డి, నాయకులు లెక్కల విజయ్, నెల్కి మల్లేశ్, శ్రీనివాసచారి, బ్రహ్మచారి గురువారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి పదవి వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

సాక్షి సినిమాలు



మంచిర్యాల

శ్రీనివాస	:ధమాక
వెంకటేశ్వర	: ఖుషి
జెమిని సినిమా స్క్రీన్ 1	: లక్కీ లక్ష్మణ్/ టాప్‌గేర్/ఎఫ్ఎం2
జెమిని సినిమా స్క్రీన్ 2	: ధమాక/ అవతార్-2/ప్రత్యర్థి

లక్సెట్టిపేట

మహానంద	: ధమాక

జన్నారం

రాఘవేంద్ర	: రాజయోగం

చెన్నూర్

శ్రీశ్రీనివాస	:ధమాక

బెల్లంపల్లి

రామకృష్ణ	: ధమాక
బాలాజీ	:ఖుషి

సీసీసీ

దేవి	: 18 పేజెస్
తిరుమల	: కింగ్‌డమ్ ఆఫ్ ద డైనోసార్

- మంచిర్యాలటౌన్

ప్రాజెక్ట్ ఉన్నా.. ఫలితం సున్నా

మండలానికి సమీపంలో నిర్మించిన గొల్లవాగు ప్రాజెక్ట్ ప్రధాన కాలువ నుంచి పంటలకు నీరు చేరేలా పిల్ల కాలువలు నిర్మించకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పిల్లకాలువలు లేకపోవడంతో మోటార్లు ఏర్పాటు చేసుకొని తామే స్వయంగా కాలువలు తవ్వి పంటపొలాలకు సాగు నీరు తెచ్చుకుంటున్నట్లు రైతులు తెలిపారు. పక్కనే ప్రాజెక్ట్ ఉండి కూడా లాభం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటిపారుదలశాఖ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకొని ప్రధాన కాలువ నుంచి పిల్ల కాలువలు తవ్వించి, సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు. ప్రాజెక్ట్ ఏఈ శశాంక్‌రెడ్డిని 'సాక్షి' సంప్రదించగా క్యాడీవామ్ పథకం కింద ప్రతిపాదనలు పంపినట్లు నిధులు మంజూరుకాగానే పిల్ల కాలువలు నిర్మించనున్నట్లు తెలిపారు.

- భీమారం


రైతులు తవ్వుకున్న కాలువ

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ


మాట్లాడుతున్న బొడిగె శోభ

చెన్నూర్/రామకృష్ణాపూర్: రాష్ట్రం కుటుంబ పాలన సాగుతుందని,ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయటంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బుడిగె శోభ అన్నారు. బీజేపీ చెన్నూర్ నియోజకవర్గ పాలక్‌గా ఇటీవల నియమితులైన ఆమె గురువారం చెన్నూర్ పట్టణంలో, ఆర్‌కేపీలో నిర్వహించిన శక్తి కేంద్ర ఇన్‌చార్జీల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ కుటుంబపాలనతో రాష్ట్రం అతలాకుతలమైందని, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేశారని మండిపడ్డారు. ఎనిమిదేళ్ల కాలంలో అవినీతి సంపాదన పెరగడంతో, టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారని తెలిపారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని అన్నారు.రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో అన్ని నియోజకవర్గాల బూత్‌కమిటీ, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, మండల, జిల్లా అధ్యక్షులతో నిర్వహించే సమావేశానికి జాతీయ అధ్యక్షుడు నడ్డా ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి బూత్ కమిటీ, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు హాజరుకావాలని కోరారు. సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ కోకన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అందుగుల శ్రీనివాస్, విశ్వంభర్‌రెడ్డి, ఆలం బాపు, సుశీల్‌కుమార్, శివ, రాజ్‌కుమార్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలి

బెల్లంపల్లి/భీమిని: ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాడాలని బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుదర్శన్‌గౌడ్ తెలిపారు. తాండూర్ మండలం అశోక్‌నగర్, భీమిని మండలం చిన్నగుడిపేటలో బుధవారం నిర్వహించిన బీజేపీ శక్తి ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్షేత్రస్థాయిలో బూత్‌కమిటీలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ సంతోష్, మండల బీజేపీ అధ్యక్షుడు మహీధర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి విష్ణు కళ్యాణ్, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్ష,కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆచార్య దేవోభవ అవార్డు

మంచిర్యాలఅర్బన్: హైదరాబాద్ హైటెక్స్‌లో 4, 5న టీచింగ్, లెర్నింగ్, లీడర్‌షిప్‌పై నిర్వహించిన కాన్ఫరెన్సు, వర్క్‌షాప్‌లో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులకు ఆచార్యదేవో భవ అవార్డులు అందుకున్నారు. మంచిర్యాల హ్యాపీ స్కాలర్‌స్కూల్ కరస్పాండెంట్ విక్రమ్‌రావు, రివిలేషన్ స్కూల్ కరస్పాండెంట్ విష్ణువర్ధన్‌రావు, క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ కస్తూరి పద్మచరణ్ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌రావు, పలువురి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.


ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కరస్పాండెంట్ విక్రమ్‌రావు

ఆకట్టుకున్న టీఎల్ఎంల మేళా


భీమారంలో ప్రదర్శనలు పరిశీలిస్తున్న అధికారులు


ప్రదర్శనలు తిలకిస్తున్న అతిథులు


మేళాను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సత్యనారాయణ

భీమిని/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/భీమారం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ బోధన అభ్యాసన మేళా ఎంతగానో ఉపయోగపడుతుందని పలువురు పేర్కొన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో, హాజీపూర్ మండలంలోని రాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, భీమారం జెడ్పీఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన బోధన అభ్యాసన మేళా ఆకట్టుకుంది. భీమినిలో జెడ్పీటీసీ సత్యనారాయణ, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, హాజీపూర్‌లో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, రైతుబంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, మండల విద్యాధికారి పోచయ్య, భీమారంలో తహసీల్దార్ వాసంతి, ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి, నోడల్ ఆఫీసర్ దత్తుమూర్తి, కాంప్లెక్స్ నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే నిర్దేశిత బొగ్గు రవాణా

- మందమర్రి జీఎం శ్రీనివాస్


సీహెచ్‌పీ ఉద్యోగులతో జీఎం శ్రీనివాస్

రామకృష్ణాపూర్: సీహెచ్‌పీ ఉద్యోగులందరి సమష్టి కృషి కారణంగానే నిర్దేశించిన బొగ్గు రవాణా చేయగలుగుతున్నామని మందమర్రి జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. ఏరియాలోని ఆర్‌కేపీ సీహెచ్‌పీని గురువారం జీఎం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీహెచ్‌పీలో కాలానికి తగ్గట్టుగా మార్పులు చేస్తూ, రేకుల స్థాయిని పెంచుకోవటం అభినందనీయమన్నారు. డిసెంబర్ వరకు 634రేకుల బొగ్గు సరఫరా చేయటం హర్షనీయమని, రాబోయే రోజుల్లోనూ ఇదే స్ఫూర్తిని చాటి మరింతగా రేకుల సరఫరా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ ఓదెలు, డీజీఎం బాలాజీ భగవతి, డీవైఎస్ఈ చంద్రమౌళి, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణిలో క్రీడలకు పెద్దపీట'

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థ క్రీడలకు పెద్దపీట వేస్తుందని మందమర్రి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో బాస్కెట్ బాల్, ఇల్లందు క్లబ్ ఆవరణలో లాంగ్ టెన్నిస్ సింగరేణి కంపెనీ స్థాయి పోటీలకు జీఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సింగరేణిలో క్రీడాకారులకు కొదువ లేదన్నారు. క్రీడలతో పాటు బొగ్గు ఉత్పత్తి విషయంలో కూడా ముందుంటారన్నారు. ఆయన వెంట ఎస్వోటుజీఎం కృష్ణారావు, ఎచ్‌వోడీ శ్యాంసుందర్, సీనియర్ పీవో మైత్రేయబంధు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్స్ సుందర్‌రాజ్, అశోక్, జాన్‌వెస్లీ, శ్రీనివాస్, రమేష్, ఎస్అండ్‌పీసీ ఏరియా కో ఆర్డినేటర్ చిన్నయ్య, గ్రౌండ్ ఇన్‌చార్జి తిరుపతి, యూనియన్ల ప్రతినిధులు ఉన్నారు.

సీహెచ్‌పీలో ఘనంగా శాంతి హోమం


పూర్ణాహుతిలో జీఎం సంజీవరెడ్డి దంపతులు

శ్రీరాంపూర్: స్థానిక సీహెచ్‌పీలో గురువారం శాంతి హోమం నిర్వహించారు. సీహెచ్‌పీలోని కనుకదుర్గ ఆలయంలో జరిగిన ఈ హోమంలో జీఎం సంజీవరెడ్డి, డీజీఎం డీవీ రావు, ఇంజనీర్ సదయ్య దంపతులు పాల్గొని హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగులకు ఈ సంవత్సరం శుభం కలుగాలని, సీహెచ్‌పీలో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా అమ్మవారు చల్లగా చూడాలని కోరుతూ శాంతియజ్ఞం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూజీఎం త్యాగరాజు, షిఫ్ట్ ఇన్‌చార్జి మోహన్, ఫిట్ సెక్రెటరీ శ్రీనివాసచారి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

సదస్సు జయప్రదం చేయండి

మందమర్రిరూరల్: గోదావరిఖనిలో ఈ నెల 8న సింగరేణి పరిరక్షణ కోసం నిర్వహించే సింగరేణి కార్మిక సంఘాల సదస్సును జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎమ్మెస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, కార్మిక సంఘాల నాయకులు సంజయ్‌కుమార్, వెల్డి సుదర్శన్, పార్వతి రాజిరెడ్డి, జాఫర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎస్ఎల్పీ పత్రాలు అందజేత

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో 30మంది ఉద్యోగులకు సర్వీస్ లింక్ట్ ప్రమోషన్లు(ఎస్ఎల్పీ) అందించారు. గనిపై గురువారం జరిగిన కార్యక్రమంలో ఓసీపీ ప్రాజెక్టు అధికారి పురుషోత్తంరెడ్డి ఈ ప్రమోషన్ పత్రాలను అందించారు. రక్షణతో పని చేసి ఓసీపీ ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో మూడు నెలల క్రితం మృతి చెందిన కందుల అంకులు కుటుంబానికి కంపెనీ నుంచి సోషల్ సెక్యూరిటీ ఫండ్(ఎస్ఎస్ఎఫ్) మంజూరు కాగా ఈ మొత్తం రూ. 53,500 చెక్కును అంకులు భార్య తిరుమలకు పీవో అందించారు.

'చారిత్రాత్మకమైన ఒప్పందం చేసుకున్నాం'

శ్రీరాంపూర్: 11వ వేజ్‌బోర్డులో చారిత్రాత్మకమైన ఒప్పందం చేసుకున్నామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా వర్క్ షాప్‌లో గురువారం ఆయన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. తమ నాయకుడు, వేజ్‌బోర్డు సభ్యులు లక్ష్మారెడ్డి కృషి వల్లే నేడు మెరుగైన ఒప్పందం జరిగిందన్నారు. 19శాతం వేతనాల పెంపు బొగ్గు గనికార్మికుల విజయమన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళా కార్మికులు బీఎంఎస్‌లో చేరగా వారికి సత్తయ్య కండువా కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో రమేశ్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

'ప్రణాళికాబద్ధంగా చదివితే ప్రయోజనం'


వేణు కళ్యాణ్‌కు పూల బొకే ఇస్తున్న విద్యార్థినీ

బెల్లంపల్లి: విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివితే మెరుగైన రీతిలో ఉత్తీర్ణత సాధించడం ఏమాత్రం కష్టసాధ్యం కాదని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు వేణు కళ్యాణ్ సూచించారు. తాండూర్ మండల కేంద్రంలోని సురభి గార్డెన్స్‌లో బుధవారం విద్యాభారతి విద్యాసంస్థలు, విజన్ జూనియర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 600మందికి పైగా విద్యార్థులు సదస్సులో పాల్గొనగా, వేణు కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రధానోపన్యాసం చేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవడంతో పాటు సరైన సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో వాసాల ప్రభాకర్ రావు, విద్యాభారతి విద్యాసంస్థల డైరెక్టర్ సురభి శరత్‌కుమార్, విజన్ జూనియర్ కళాశాల డైరెక్టర్ సుశీల్, భావన రుషి, వాణినికేతన్ కరస్పాండెంట్ రాము, కేజీబీవీ హెడ్ మాస్టర్, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన


చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 11వ వార్డులో ఇంటింటికీ వెళ్లి సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రజలకు వివరించారు. అనంతరం స్థానిక సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకుని, ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో కాసేపు మాట్లాడి, పౌష్టికాహారం తీసుకోవాలని చిన్నారులకు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన

కోటపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులకు ఎంపీడీవో భాస్కర్ అవగాహన సదస్సు నిర్వహించారు. 2023-24సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో మహేందర్, ఏపీఎం రాజన్న, పశువైద్యాధికారి పవన్‌కుమార్, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో జీపీడీపీ 2023-24ఆర్థిక సంవత్సరం యాక్షన్ ప్లాన్ తయారీపై గురువారం సమావేశం నిర్వహించారు. ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేశం, ఎంపీవో సత్యనారాయణ, కార్యదర్శులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జన్నారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, మండలస్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీపీడీవో 2023-24సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికలు తయారు చేయడానికి ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో రమేశ్ తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, ఎంఈవో

మంచిర్యాలఅర్బన్: టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన 2023డైరీ, క్యాలెండర్, అధ్యాపకదర్శినిని గురువారం విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారి పద్మజా, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి, టీఎస్‌జీహెచ్‌ఎంఎ జిల్లా అధ్యక్షుడు హన్మండ్లు, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రామన్న, రాజావేణు పాల్గొన్నారు.

భీమారం/దండేపల్లి: 2023 నూతన సంవత్సర క్యాలెండర్లను భీమారం మండల కేంద్రంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో, దండేపల్లి మండలంలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. భీమారంలో తహసీల్దార్ వాసంతి, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, తపస్ జిల్లా అధ్యక్షుడు సాయింపు శ్రీనివాస్ రావు, మండల కమిటీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొనగా, దండేపల్లిలో తహసీల్దార్ హన్మంతరావు, సంఘ నాయకులు రాజవేణు, చంద్రమౌళి, తులసీపతి, మల్లేశం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అకాల వర్షం.. అన్నదాతలకు నష్టం

కోటపల్లి: అకాల వర్షాలతో అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లింది. మల్లంపేట, కొండంపేట, నాగంపేట గ్రామాల్లో గురువారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. పత్తి కూడా పూర్తిగా తడిసినట్లు, వర్షాలు తమకు ఆర్థిక నష్టాన్ని తెచ్చాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సన్మానం

కోటపల్లి: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ఎన్నికైన అంజనేయగౌడ్‌ను గురువారం ఎల్‌బీ స్టేడియంలో జరిగిన సమావేశంలో మండల నాయకులు ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపీపీ వాలశ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అంజనేయగౌడ్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రభుత్వ పాఠశాల బోర్డు విరాళం

మంచిర్యాలఅర్బన్: సామాజిక జాగృతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాత మంచిర్యాలకు రూ.15వేల విలువ చేసే స్కూల్ బోర్డును విరాళంగా అందించారు. పాఠశాల బోర్డును గురువారం ఆవిష్కరించారు.

మహాసభ విజయవంతం చేయండి

దండేపల్లి: ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 11న బెంగుళూర్‌లో నిర్వహించే జాతీయ మహాసభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. మహాసభకు జన సమీకరణలో భాగంగా గురువారం దండేపల్లిలో ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, నరేష్, నాయకులు రఘు, మహేష్, ప్రకాష్, అభిషేక్, రాజన్న పాల్గొన్నారు.

ముగిసిన భూ కబ్జా వివాదం

చెన్నూర్: మండలంలోని బావురావు పేట క్రీడా ప్రాంగణానికి కేటాయించిన స్థలం వివాదానికి తెర పడింది. వారం రోజుల క్రితం క్రీడాప్రాంగణ స్థలాన్ని చెన్నూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త రాంలాల్‌గిల్డా 4గుంటల భూమిని కబ్జా చేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే, ఆర్ఐ తిరుపతి, మండల సర్వేయర్ ప్రసాద్ బుధవారం రాత్రి స్థలాన్ని పరిశీలించారు. గతంలో క్రీడా ప్రాంగణం కోసం కేటాయించిన స్థలంలో సిమెంట్ పోల్స్ ఉండడంతో అధికారులు తొలగించి గ్రామ పంచాయతీకి అప్పగించారు. దీంతో క్రీడా స్థల వివాదం ముగిసింది.

గ్రామ కమిటీ ఎన్నిక

చెన్నూర్‌రూరల్: సీపీఐ పార్టీ మండల కార్యదర్శి నెన్నల సమ్మయ్య ఆధ్వర్యంలో మండలంలోని గంగారం, చింతలపల్లి గ్రామాల్లో గురువారం సమావేశాలు ఏర్పాటు చేశారు. గంగారం గ్రామ పంచాయతీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కోతులు, కుక్కల బెడద నుంచి రక్షించాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలో కోతులు, కుక్కలు, పందుల బెడద ఎక్కువైందని, వాటిని నివారించాలని కోరుతూ బీజేపీ నాయకులు గురువారం మున్సిపల్ మేనేజర్ కె.విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టి, ప్రజలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, జిల్లా మాజీ అధ్యక్షుడు మున్నారాజా సిసోడియా, జిల్లా అధికార ప్రతినిధి మధుసూదన్ రావు, పట్టణ ఉపాధ్యక్షుడు సోమ ప్రదీప్ చంద్ర, రమేష్, ముదిరాజ్ పాల్గొన్నారు.

మాంజా అమ్మితే చర్యలు తప్పవు

చెన్నూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వం నిషేధించిన మాంజాను వ్యాపారులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని చెన్నూర్ ఎస్సై మహేందర్, హాజీపూర్ ఎస్సై ఉదయ్‌కిరణ్ హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం చెన్నూర్ పట్టణంలో, హాజీపూర్‌లోని పలు షాపుల్లో మాంజా అమ్మకాలపై ఆకస్మిక తనిఖీ చేశారు. మాంజా అమ్మినట్లు తెలిస్తే సమాచారం అందించాలని సూచించారు.

మధ్యాహ్నం భోజనం అమలు చేయాలి

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సన్నిగౌడ్ అన్నారు. మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గురువారం మధ్యాహ్న భోజనం అమలు చేయకపోవటంపై ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు.

తనిఖీ

వేమనపల్లి: ప్రతి గ్రామ పంచాయతీల్లో శానిటేషన్ సిబ్బంది 7గంటలకే విధుల్లోకి హాజరుకావాలని ఎంపీఓ బాపురావు అన్నారు. దస్నాపూర్‌లో గురువారం మొబైల్ ఇన్‌స్పెక్షన్ యాప్ ద్వారా తనిఖీలు నిర్వహించారు. ట్రాక్టర్ ద్వారా చెత్తను తరలించి తడి, పొడి చెత్తను వేరు చేయాలన్నారు.